క్లుప్తంగా

జవాన్‌కు ఘన స్వాగతం



దుగ్గొండి : ఆర్మీలో 20 ఏళ్లపాటు సేవలు అందించి ఉద్యోగ విరమణ పొందిన జవాన్‌కు స్వగ్రామంలో గ్రామస్తులు శనివారం రాత్రి ఘనస్వాగతం పలికారు. మండలంలోని నాచినపల్లి గ్రామానికి చెందిన వడ్డేపల్లి చంద్రమౌళి-భాగ్యమ్మ దంపతుల కొడుకు విక్రమ్ 2004లో ఆర్మీలో చేరాడు. పంజాబ్, అస్సాం, హిమాచల్ ప్రదేశ్, జమ్ము కశ్మీర్, సిక్కింల్లో సేవలు అందించి ఫిబ్రవరి 29న ఉద్యోగ విరమణ పొందాడు. ఈ సందర్భంగా ఆయన స్వగ్రామానికి రాగా యువజన,పద్మశాలీ సేవా సంఘాల ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు. ఓపెన్ టాప్ జీపులో ఊరేగించారు.

శాసనసభ స్పీకర్ ప్రసాద్‌ను కలిసిన ఎమ్మెల్యే



వర్ధన్నపేట : తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను స్థానిక ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు శనివారం హైదరాబాద్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే వెంట కిసాన్ సెల్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు పింగిళి వెంకట్రాంరెడ్డి, వరంగల్ జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్‌రావు, వర్ధన్నపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అబ్బిడి రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'గౌరవ వేతనం ఇప్పించండి'



దుగ్గొండి : తనను పూజారిగా గుర్తించి ప్రభుత్వం నుంచి గౌరవ వేతనం ఇప్పించాలని కోరుతూ రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు అఖిల భారత హనుమాన్ ప్రచారకుడు గాదెపాక రాములు శనివారం వినతిపత్రం అందజేశారు. అనంతరం రాములు మాట్లాడారు. తాను దళిత పూజారినని చెప్పారు. సుమారు 30 ఏళ్లుగా మండలంలోని ముద్దునూరు గ్రామంలోని హనుమాన్ ఆలయంలో పూజారిగా పని చేస్తున్నట్లు తెలిపారు. తెలంగాణలోని 9 ఉమ్మడి జిల్లాల పరిధిలో 534 ఆలయాల్లో హోమాలు నిర్వహించినా తనకు గుర్తింపు రాలేదన్నారు. ప్రభుత్వం నుంచి గౌరవ వేతనం మంజూరు చేయించడంతోపాటు రానున్న రాష్ట్ర అవతరణ వేడుకలో తనకు అవార్డు ఇప్పించాలని కోరారు.

'ఇతర కులస్తులకు మున్నూరు కాపు సర్టిఫికెట్లు ఇవ్వొద్దు'



ఖానాపురం : ఇతర కులస్తులకు మున్నూరు కాపు కుల ధృవీకరణ పత్రాలు ఇవ్వవద్దని కోరుతూ తహసీల్దార్ కిరణ్‌కుమార్‌కు ఆ కుల సంఘం బాధ్యులు అన్నం ప్రసాద్, రాగం సాంబయ్య, సుంకరి నాగేశ్వర్‌రావు శనివారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ప్రసాద్, సాంబయ్య, నాగేశ్వర్‌రావు మాట్లాడారు. మండలానికి చెందిన కొందరు ఇతర కులస్తులు మున్నూరుకాపు కులస్తులుగా సర్టిఫికెట్లు పొందుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు నీలం సాంబయ్య, రాగం సోమయ్య, తరాల శ్రీను, సత్యం, సాంబయ్య, రాజు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి నాయకుడి ఆర్థికసాయం

గీసుకొండ : మండలంలోని నందనాయక్‌తండాకు చెందిన బాదావత్ కమలమ్మ అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు, ప్రముఖ సామాజిక సేవకుడు అల్లం బాలకిశోర్‌రెడ్డి శనివారం రూ.5 వేల సాయం అందజేశారు. ఈ మేరకు ఆయన ఆ పార్టీ నాయకుడు అల్లం మర్రెడ్డి ద్వారా బాధిత కుటుంబానికి నగదు పంపించారు. కార్యక్రమంలో ఎంపీపీ బీమగాని సౌజన్య, నాయకులు చాడ కొమురారెడ్డి, సాయిలి ప్రభాకర్, కూసం రమేశ్, మాదాసి రాంబాబు, నరేశ్, నర్సింహ, చేవ్లా నాయక్ పాల్గొన్నారు.

గన్నారంలో..

రాయపర్తి : మండలంలోని గన్నారం గ్రామానికి చెందిన ఈరెల్లి ఉప్పలయ్య ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి ఉప్పలయ్య కుమార్తె సుష్మతో కలిసి 2008–09 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకున్న స్నేహితులు శనివారం రూ.9300 సాయం అందజేశారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఉప్పలయ్య మృతి బాధాకరమన్నారు. కార్యక్రమంలో సుష్మ స్నేహితులు కుంట రాజు, గడ్డం వేణు, కుక్కల వికాస్ తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు

- జేడీఏ ఉషాదయాళ్



పంటను పరిశీలిస్తున్న జేడీఏ, అధికారులు

నర్సంపేట రూరల్ : మొక్కజొన్న పంటలో సస్యరక్షణ చర్యలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయాధికారి (డీఏఓ) ఉషాదయాళ్ తెలిపారు. నర్సంపేట మండలంలోని పలు గ్రామాల్లో శనివారం ఆమె మొక్కజొన్న పంటలను పరిశీలించి మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో మొక్కజొన్న పంటలను పాముపొడ తెగులు ఆశిస్తోందని చెప్పారు. దీని నివారణ కోసం మిల్లీ లీటరు ప్రొపికనజోల్ లేదా హెక్సాకోనజోల్ లేదా 2 మిల్లీ లీటర్ల వాలిడామైసిన్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. జీరో టిల్లేజ్ మొక్కజొన్నలో భాస్వరం లోపం ఉంటే 2 శాతం డీఏపీ మందును లీటరు నీటిలో కలిపి ఐదు రోజుల వ్యవధిలో పిచికారీ చేయాలని చెప్పారు. కత్తెర పురుగు నివారణ కోసం 0.4 మిల్లీలీటర్ల క్లోరం ట్రానిలిప్రోల్ లేదా 0.5మిల్లీ లీటర్ల స్పైనటోరం మందును లీటరు నీటిలో కలిపి ఆకుల సుడుల లోపల తడిచేలా స్ప్రే చేయాలని డీఏఓ సూచించారు. కాండం తొలిచేపురుగు నివారణకు కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలను ఎకరాకు 3 కిలోలు మొగిలో పడే విధంగా వేసుకోవాలన్నారు. మొక్కజొన్నలో స్టాక్ రాట్ నివారణకు 800 గ్రాముల బ్లీచింగ్ పౌడర్‌ను ఎకరా మొక్కలపై పడేలా పిచికారీ చేయాలని తెలిపారు. అలాగే 4 కిలోల బ్లీచింగ్ పౌడర్‌ను నేలలో వేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఏడీఏ శ్రీనివాస్, జాతీయ ఆహార భద్రతా మిషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా కన్సల్టెంట్ కృష్ణారెడ్డి, ఏఓ కృష్ణ కుమార్, ఏఈఓ అశోక్, తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే సమగ్రాభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శంకర్

పర్వతగిరి : సమష్టి కృషితోనే సమగ్రాభివృద్ధి సాధ్యమని ఎంపీడీఓ శంకర్ స్పష్టం చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ లూనావత్ కమల పంతులు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించారు. మొత్తం 14 మంది ఎంపీటీసీలకు గాను ఏడుగురు మాత్రమే హాజరయ్యారు. సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసిన క్రమంలో వారూ లేకపోగా అధికారులూ పూర్తిస్థాయిలో హాజరుకాలేదు. గైర్హాజరైన అధికారులకు షోకాజ్ నోటీసులు పంపించారు. ఈ సందర్భంగా కొంకపాక ఎంపీటీసీ మోహన్‌రావు మాట్లాడారు. వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం వివిధ శాఖల అధికారులు నివేదికలు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడారు. అధికారులు, ప్రజాప్రతినిధులు మండల అభివృద్ధికి సహకరించాలని కోరారు. సమావేశంలో జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు సర్వర్, వైస్ ఎంపీపీ ఎర్రబెల్లి రాజేశ్వర్‌రావు, తహసీల్దార్ వెంకటస్వామి, పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు జూకంటి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మహిళల సంక్షేమానికి ప్రాధాన్యం



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ సత్యవతి

రాయపర్తి : మహిళల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాధాన్యత ఇస్తున్నాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, కే.సత్యవతి తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని పెర్కవేడు, దుబ్బతండాల్లోని అంగన్‌వాడీ సెంటర్లలో శనివారం నిర్వహించిన అవగాహనా కార్యక్రమాల్లో వారు మాట్లాడారు. సమాజాభివృద్ధిలో మహిళలు కీలకమని చెప్పారు. మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందితే మెరుగైన సమాజం నిర్మితమౌతుందని తెలిపారు. సమాజంలోని సమస్యలు, రుగ్మతలపై అవగాహన పెంచుకుని చైతన్యవంతం కావాలని సూచించారు. సమస్యలను బట్టి బాధిత మహిళలు 1098, 181, 100, 14567, 15536, 1930 తదితర టోల్ ఫ్రీ నంబర్లకు ఫోన్ చేసి సాయం పొందాలని సూచించారు. మహిళల రక్షణకు ప్రభుత్వాలు ప్రణాళికాయుతంగా పని చేస్తున్నాయని చెప్పారు. కార్యక్రమాల్లో దుబ్బతండా పంచాయతీ కార్యదర్శి కార్తీక్, శశిధర్, అంగన్‌వాడీ కార్యకర్తలు త్రివేణి, పాలెపు శారదదేవి, వడగం మంజుల, నాగమణి, మంగమ్మ పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉద్యోగ కల్పనే ధ్యేయం



క్షీరాభిషేకం చేస్తున్న అనిల్, నాయకులు

పర్వతగిరి : నిరుద్యోగులకు ఉద్యోగం కల్పించడమే ధ్యేయంగా రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు చేపడుతోందని యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు కందికట్ల అనిల్, జిల్లా ప్రధాన కార్యదర్శి పుల్లూరి దిలీప్ గౌడ్ తెలిపారు. ప్రభుత్వం మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయడాన్ని హర్షిస్తూ మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే నాగరాజు చిత్రాలతో ముద్రించిన ఫ్లెక్సీకి యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో శనివారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా అనిల్, దిలీప్ మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించేలా 11062 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేశారని చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యోగాల భర్తీని విస్మరించి గొర్లు, బర్లు అందజేసి నిరుద్యోగ యువతను అవమానించిందని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి ప్రణాళికాయుతంగా ముందుకు సాగుతోందని చెప్పారు. మెనిఫెస్టోలో పొందుపర్చిన ఆరు గ్యారంటీల అమలుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్‌నాయక్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నీరటి ప్రశాంత్, వర్ధన్నపేట నియోజకవర్గ కార్యదర్శి నరేశ్, నాయకులు పంతంగి దేవేందర్, పిట్టల లోకేశ్, గొడుగు వినయ్, రాము, పృథ్వీ, స్వామి, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ నరుకుడు రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వయం పాలన దినోత్సవం



విద్యార్థులతో ఉపాధ్యాయులు

చెన్నారావుపేట : మండలంలోని ఖాదర్‌పేట గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం స్వయం పాలన దినోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులను మరిపించేలా విధులు నిర్వర్తించి ఆకట్టుకున్నారు. హెచ్‌ఎంగా కొంకటి వెన్నెల, ఉపాధ్యాయులుగా బిల్ల సుస్మిత, పసునూరి మహోన్నత, పల్లవి, మంద అశ్విత, పీఈటీగా సాదు అక్షయ ప్రియ, అటెండర్‌గా బొమ్మకంటి మింటు, ఎంఈఓగా బొమ్మకంటి రాజేశ్‌కుమార్, డీఈఓగా సాధు మేఘాలు వ్యవహరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులుగా వ్యవహరించిన విద్యార్థులకు హెచ్‌ఎం వరగంటి వెంకటేశ్వర్లు బహుమతులు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉమాశంకర్‌గౌడ్, శ్యాంసుందర్, ఈక నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

'పుస్కోస్'లో గ్రాడ్యుయేషన్ డే



వర్ధన్నపేట : పట్టణంలోని పుస్కోస్ స్కూల్‌లో శనివారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాదర్ అనుకిరణ్ విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసి మాట్లాడారు. పాఠశాల స్థాయిలోనే విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీసేలా కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు ఆటపాటలతో అలరించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ మేరీ ఆంటోని, ప్రధానోపాధ్యాయురాలు డైసీ, అడ్మినిస్ట్రేటర్ జెనీఫర్, షర్మిల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నివాళి



నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని ఇటుకాలపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు ఉల్లెంగుల చంద్రమౌళి శనివారం మృతి చెందగా ఆయన మృతదేహానికి స్థానిక మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఈర్ల నర్సింహరాములు, మాజీ సర్పంచ్ మండల రవీందర్, ఎంపీటీసీ భూక్య వీరన్న, తదితరులు పాల్గొన్నారు.

నాలుగు ఉద్యోగాలు సాధించిన యువతికి సన్మానం



నర్సంపేట : పట్టణానికి చెందిన గుంటి సాహితిని నాలుగు ఉద్యోగాలు సాధించిన సందర్భంగా లీడ్ లైబ్రరీ వ్యవస్థాపకుడు, ప్రభుత్వ ఉపాధ్యాయుడు కాసుల రవికుమార్ దంపతులు శనివారం శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందజేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర గురుకుల బోర్డు చేపట్టిన నియామకాల్లో ప్రతిభ చాటి నాలుగు ఉద్యోగాలు సాధించడం అభినందనీయమని తెలిపారు. అనంతరం సాహితి మాట్లాడారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతోనే ఉద్యోగాలు సాధించగలిగినట్లు తెలిపారు.

ఓటరు అవగాహన ర్యాలీ



గీసుకొండ : మండల కేంద్రంలో నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో శనివారం ఓటరు అవగాహన ర్యాలీ నిర్వహించారు. 18 ఏళ్లు నిండిన ప్రతీఒక్కరు ఓటు హక్కు కలిగి ఉండాలని, ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నూనె వేణుప్రసాద్, వలంటీర్లు గాలి భిక్షపతి, వెల్దండి సురేశ్, మహిళా సంఘం వీఓ భవాని, హేమలత పాల్గొన్నారు.

జెడ్పీ బాలికల పాఠశాలలో రికార్డుల పరిశీలన



నర్సంపేట : పట్టణంలోని జెడ్పీ బాలికల స్కూల్‌ను సెస్ సీనియర్ అబ్జర్వర్, పరిశోధన అధికారి వేమునూరి మల్లారెడ్డి శనివారం సందర్శించారు. నాలుగు మండలాల విద్యాభివృద్ధి, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరు, పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, బోధన అంశాల వివరాలు నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో నిర్వహిస్తున్న సమగ్రశిక్ష అభియాన్, పీఎం పోషణ్ పథకాల అమలును పరిశీలించి ప్రభుత్వానికి నివేదికలు అందజేస్తామన్నారు. అధికారులు, హెచ్‌ఎం నుంచి విద్యాభివృద్ధికి సలహాలను తీసుకోనున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 620 పాఠశాలల్లో సర్వే, సామాజిక తనిఖీ ఉంటాయని, ఏటా జిల్లాకు 20 పాఠశాలల చొప్పున తనిఖీలు ఉంటాయన్నారు. బిల్లులు సకాలంలో చెల్లించాలని మధ్యాహ్న భోజన నిర్వాహకులు ఆయనను కోరారు. ప్రభుత్వానికి క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలు తెలియజేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఈఓ రత్నమాల, హెచ్‌ఎం కాంతయ్య, ఎంఆర్సీ ఉద్యోగులు శశిధర్, శ్రావణ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పర్వతగిరి : మండలంలోని పర్వతగిరి, రావూరు, చౌటపల్లి గ్రామాల్లో నేడు ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ఏడీఈ చంద్రమౌళి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫీడర్ల పరిధిలో చెట్ల కొమ్మలు తొలగించనున్న క్రమంలో సదరు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపేస్తామని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

సొసైటీ రికార్డుల స్వాధీనం

దుగ్గొండి : మండలంలోని నాచినపల్లి పీఏసీఎస్‌అవినీతి జరిగిందనే ఫిర్యాదు మేరక శుక్రవారం డీసీఓ సంజీవరెడ్డి విచారణ చేశారు. సొసైటీలో నాలుగేళ్లలో జరిగిన పనులు, నిధులు, ఖర్చులు, జమకు సంబంధించిన రికార్డులను ప్రత్యేక అధికారి నాగనారాయణ శనివారం స్వాధీనం చేసుకున్నారు. పూర్తిస్థాయి సమగ్రంగా విచారణ జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

'బండి సంజయ్ వైఖరి మార్చుకోవాలి'

ఐనవోలు : కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ వైఖరి మార్చుకోవాలని గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు నకరకంటి మోహన్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో బండి సంజయ్ దిష్టిబొమ్మను శనివారం దహనం చేశారు. ఈ సందర్భంలో మోహన్ మాట్లాడారు. పొన్నం ప్రభాకర్ కుటుంబాన్ని ఉద్దేశించి వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో సమ్మెట మహేందర్, ఆరెల్లి రాము, సత్యం, గడ్డం శ్రీనివాస్, కత్తి దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.

'లఖ్‌పతి దీదీ'తో మహిళలకు లబ్ధి



ఖానాపురం : మాట్లాడుతున్న డీపీఎం సరిత



దుగ్గొండి: మాట్లాడుతున్న ఏపీఎం గీతారాణి

ఖానాపురం : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లఖ్‌పతి దీదీ పథకంతో మహిళలకు ఆర్థికంగా లబ్ధి చేకూరనుందని డీపీఎం సరిత తెలిపారు. మండల కేంద్రంలోని సమాఖ్య కార్యాలయంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మహిళా సంఘాల్లోని సభ్యులు లఖ్‌పతి దీదీ పథకాన్ని వినియోగించుకుని ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం కావాలని సూచించారు. మహిళలకు జీవనోపాధులను మెరుగుపర్చడమే పథకం ఉద్దేశ్యమన్నారు. కొత్త జీవనోపాధులను సృష్టించి ఆదాయాన్ని పెంచుకోవచ్చని తెలిపారు. అధిక ఆదాయాన్ని పొందడానికి తగిన ప్రణాళికలు రూపొందించి ప్రత్యేక యాప్‌లో పొందుపర్చి చేయూత అందించనున్నట్టు వివరించారు. అర్హులైన సంఘాల వివరాలను యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. సమావేశంలో ఏపీఎం కందిక సుధాకర్, సీసీలు కరుణ, నర్సయ్య, మండల సమాఖ్య కార్యదర్శి కృష్ణకుమారి, తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధి

దుగ్గొండి : లఖ్‌పతి దీదీ పథకంతో మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించనున్నారని ఏపీఎంలు సుధాకర్, గీతారాణి తెలిపారు. మండల కేంద్రంలోని ప్రశాంతి మండల సమాఖ్య కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. పథకంపై అవగాహన కల్పించారు. మహిళా సంఘాల్లోని సభ్యులకు ఏటా లక్ష రూపాయల ఆదాయం వచ్చేలా వివిధ రకాల వ్యాపారాలు చేయడానికి శిక్షణ ఇవ్వడంతోపాటు బ్యాంకు నుంచి రూ.5 లక్షల రుణం తీసుకునే అవకాశం కల్పించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం రాజ్‌కుమార్, సమాఖ్య అధ్యక్షురాలు లలిత, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో బీజేపీకి గుణపాఠం తప్పదు

- ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి రవి



సమావేశంలో మాట్లాడుతున్న రవి

గీసుకొండ : రానున్న పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీకి గుణపాఠం తప్పదని ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి స్పష్టం చేశారు. మండలంలోని గంగదేవిపల్లిలో శనివారం నిర్వహించిన ఆ పార్టీ రాష్ట్ర సమావేశాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ అన్ని వర్గాల ప్రజలకు నష్టం కలిగించేలా, కార్పొరేట్ శక్తులకు లబ్ధి చేకూర్చేలా మోసపూరిత పాలన సాగిస్తోందని విమర్శించారు. ప్రధాని మోదీ నియంతృత్వంపై ఉద్యమాలు తప్పవన్నారు. మోదీ అనుసరిస్తున్న మనువాద రాజ్యాపోకడలకు, ప్రజాస్వామ్య శక్తులకు మధ్యే రానున్న పార్లమెంటు ఎన్నికలు జరగనున్నట్లు తెలిపారు. బీఎల్ఎఫ్‌తో కలిసి వరంగల్, మహబూబాబాద్, చేవెళ్ల పార్లమెంటు స్థానాల్లో అభ్యర్థులను నిలుపుతామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ దుష్టపాలనకు వ్యతిరేకంగా ప్రజాఉద్యమాలు నిర్మించాలని శ్రేణులకు సూచించారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలు అమలు చేసేలా పోరాడాలని చెప్పారు. సమావేశానికి రాష్ట్ర నాయకురాలు వంగల రాగసుధ అధ్యక్షత వహించగా పొలిట్‌బ్యూరో సభ్యుడు వల్లెపు ఉపేందర్‌రెడ్డి, కేంద్ర కమిటీ సభ్యులు వనం సుధాకర్, కుంభం సుకన్య, గోనె కుమారస్వామి, జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎన్‌రెడ్డి హంసరెడ్డి, మంద రవి, తుకారాం నాయక్, తాండ్ర కళావతి, సావిత్ర, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ మొదటి సెమిస్టర్ ఫలితాలు విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న రిజిస్ట్రార్ మల్లారెడ్డి, తదితరులు

నర్సంపేట : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన బీఏ, బీకాం, బీఎస్సీ (లైఫ్ సైన్సెస్), బీఎస్సీ (ఫిజికల్ సైన్సెస్) మొదటి సెమిస్టర్ ఫలితాలను కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లం నవీన్ వివరాలు వెల్లడించారు. బీఎస్సీ (ఫిజికల్ సైన్సెస్)లో 81, బీఎస్సీ(లైఫ్ సైన్సెస్)లో 79, బీఏలో 50, బీకాంలో 52 శాతం ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ నర్సింహాచారి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనాథ్, పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ శివనాగశ్రీను, తోట రమేశ్, డాక్టర్ విష్ణుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

'గ్రూపులను ప్రోత్సహించడం సరికాదు'



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

వర్ధన్నపేట : డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ కాంగ్రెస్‌లో గ్రూపులను ప్రోత్సహించడం సరికాదని ఆ పార్టీ సీనియర్ నాయకుడు బర్ల బాబు, యూత్ కాంగ్రెస్ జిల్లా నాయకుడు బిర్రు రాజు, మండల అధ్యక్షుడు బర్ల సతీశ్ అన్నారు. మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎర్రబెల్లి స్వర్ణ కార్యకర్తల మనోభావాలను దెబ్బతీసేలా గ్రూపులను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. పార్టీ గెలుపు కోసం పని చేసిన కార్యకర్తలను, సీనియర్ నాయకులకు సమాచారం ఇవ్వకుండానే పార్టీలో పలువురిని చేర్చుకుంటున్నారని చెప్పారు. ఎన్నికలకు ముందు పార్టీపై, నాయకులపై నిందలు వేసి ప్యాకేజీల కోసం పార్టీ మారిన నాయకులను ఎలా చేర్చుకుంటారని ప్రశ్నించారు. ఇకనైనా వైఖరి మార్చుకోవాలని స్వర్ణను కోరారు. లేనిపక్షంలో టీపీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డికి, క్రమశిక్షణ సంఘం చైర్మన్‌కు ఫిర్యాదు చేస్తామని చెప్పారు.

పరీక్ష కేంద్రాన్ని కొనసాగించాలి



వినతిపత్రం అందిస్తున్న నరేశ్, నాయకులు

నల్లబెల్లి : మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని యదావిధిగా కొనసాగించాలని కోరుతూ తహసీల్దార్ రాజేశ్‌కు ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేశ్ ఆధ్వర్యంలోని బృందం శనివారం వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా నరేశ్ మాట్లాడారు. ప్రాథమిక పాఠశాలలో ప్రభుత్వం 'మన ఊరు–మన బడి' కింద అనేక వసతులు కల్పించి అభివృద్ధి చేసిందని చెప్పారు. తాగునీటి, మరుగుదొడ్లు, బెంచీలు తదితర సదుపాయాలు కల్పించడంతోపాటు ప్రహరీ నిర్మించారని తెలిపారు. అయినా వసతులు లేవంటూ అధికారులు ప్రభుత్వానికి తప్పుడు నివేదిక ఇచ్చారని ఆరోపించారు. సదరు తప్పుడు నివేదిక ఇచ్చిన అధికారులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవడంతోపాటు పాఠశాలలో పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని కొనసాగించాలని కోరారు. లేనిపక్షంలో విద్యార్థులను సమీకరించి పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.